పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# 74. అల్ ముద్దస్సిర్ సూరా పరిచయం

పరిచయం : ఈ సూరా మక్కాలో అవతరించింది. ఇందులో 56 ఆయత్‌లు, రెండు రుకూలు ఉన్నాయి. అవతరణా క్రమంలో ఇది నాలుగవది. దీని మొదటి ఏడు ఆయత్‌లు బొత్తిగా అరాచక కాలం నాటివి. ప్రవక్త చేయవలసిన అసలు పని, ప్రజలను ఇహపరాల శిక్ష గురించి భయపెట్టటం. ప్రజలారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనకు ఎవరినీ సాటి కల్పించకండి. అన్యథా ఇహపరాలలో దైవశిక్ష మిమ్మల్ని పట్టివేస్తుంది అని ఈ ఆయత్‌లలో అల్లాహ్ సెలవిచ్చాడు.

మీ ప్రభువు ఘనతను స్తుతించండి. మనస్సును నిర్మలంగా ఉంచుకోండి. మంచి బుద్ధులు అలవర్చుకోండి. దైవమార్గంలో ఎదురయ్యే కష్టాలకు సహనం వహించండి. ఎవరికైనా మేలుచేస్తే కేవలం అల్లాహ్ కోసమే చేయండి అని దైవప్రవక్త (స) ద్వారా ప్రజలకు హితబోధ ఇవ్వబడింది.

8వ ఆయత్ నుండి చివరి వరకు ఆయత్‌లు, దైవప్రవక్త (స) దైవాదేశాన్ని అనుసరించి ప్రచారం ముమ్మరం చేసినప్పుడు అవతరించాయి. ఖుర్ఆన్ అవతరణ నిరంతరం జరిగింది. ఆయన (స) ఎడతెగని విధంగా ప్రజలకు ఖుర్ఆన్ వినిపిస్తూ వచ్చారు. ఆ కారణంగా మక్కాలో అలజడి చెలరేగి వ్యతిరేకతల తుఫాను ఎదురయ్యింది. ఇక హజ్ కాలం దగ్గర పడింది. వివిధ ప్రాంతాల వారు హజ్ నిమిత్తం వస్తారు. దైవప్రవక్త (స) నోట ఖుర్ఆన్ విన్నారంటే ప్రభావితులయి పోతారు అని తిరస్కారులు, ముష్రికులు ఆందోళనలో పడ్డారు. తిరస్కారులు, ముష్రికులు, సాధారణ ప్రజలను ఇస్లాం నుండి దూరంగా ఉంచటానికి తమ నాయకుడు వలీద్ బిన్ ముగీరాను సలహా అడిగారు. అందరూ కలిసి ఒకే విషయాన్ని ముహమ్మద్ విషయంలో ప్రచారం చేస్తే అది ప్రజలపై ప్రభావం వేస్తుంది. అందరూ ఇస్లాంకు దూరంగా ఉంటారు అని ముగీరా అభిప్రాయం వెలిబుచ్చాడు. ముహమ్మద్‌ను పిచ్చివాడు అందాం అని ఒకడన్నాడు.

ముగీరా అన్నాడు, ఇది తప్పు. ముహమ్మద్ పిచ్చివాడి చేష్టలు ప్రదర్శించడం లేదు. ముహమ్మద్‌ను జ్యోతిష్యుడు అని అపఖ్యాతి పాలుచేద్దాం అని మరొకడన్నాడు. ఇది కూడా సరికాదు. ముహమ్మద్ జ్యోతిష్యుల వంటి వాడు కాదు అని ముగీరా అన్నాడు. మరొకడు "ముహమ్మద్‌ను కవి (షాయిర్) అని దుష్ప్రచారం చేద్దాం" అన్నాడు. అందుకు ముగీరా, "ఇది కూడా తప్పే. అరబ్బులు షాయిరీ (కవనం) గురించి బాగా తెలిసినవారు. ఖుర్ఆన్ కవిత్వమూ కాదు, ముహమ్మద్ కవుల వంటివాడూ కాదు."

"మీరే ఏదయినా చేయండి. లేకుంటే జాతి మిమ్మల్ని విడిచిపెట్టదు" అని అబూ జహల్ వలీద్‌తో అన్నాడు. అప్పుడు వలీద్ అన్నాడు, "మనం అతడ్ని మంత్రగాడు" అని అనగలం.

ఎందుకంటే అతడి మాటలు విన్నవాడు ఎవరైనా ప్రభావితుడు అవుతాడు. అతడి కారణంగా కొడుకు తండ్రి నుండి విడిపోతాడు. అందుచేత హజ్ కాలం రాగానే తిరస్కారులందరూ ఏక కంఠంతో దైవప్రవక్తకు వ్యతిరేకంగా చెప్పసాగారు. "ప్రజలారా! మా వూళ్ళో ముహమ్మద్ అనే ఒక మనిషి ఉన్నాడు. మీరు

అతనికి దూరంగా ఉండండి. అతడి మాటలు వినకండి. అతడు గొప్ప మాంత్రికుడు లేదా మీ మతం, మీ విధానం, మీ కుటుంబం సమస్తం చెల్లాచెదురు అయిపోతాయి. మీలో చీలికలు వస్తాయి. అరబ్ ప్రాంతం అంతటి నుండి ప్రజలు వచ్చి ఉన్నారు. అందుచేత అరబ్ అంతటా ఆయన (స) గురించి ప్రచారం జరిగింది. కొందరు ఆయనకు దూరంగా ఉన్నారు. మరికొందరిలో, ఆయనను కలుసుకోవాలని, ఆయనకు  చేరువ కావాలని, ఆయన నోట ఖుర్ఆన్ వినాలని, ఖుర్ఆన్ అంటే ఏమిటో చూడాలని కోరిక కలిగింది. దాని వలన కొంత ప్రయోజనం కూడా చేకూరింది. కొందరు ఆయనకు దగ్గరయ్యారు. తుఫైల్ బిన్ ఉమర్ దూసీ, హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి) వంటి వారు ముస్లింలయ్యారు.

آیَاتُهَا 56 سُورَةُ الْمُدَّثِّرِ 74 مَكِّيَّةٌ رُكُوعَاتُهَا 2

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

يٰۤاَيُّهَا الْمُدَّثِّرُ ۙ﴿1﴾ قُمْ فَاَنْذِرْ ۙ﴿2﴾
وَرَبَّكَ فَكَبِّرْ ۙ﴿3﴾ وَثِيَابَكَ فَطَهِّرْ ۙ﴿4﴾
وَالرُّجْزَ فَاهْجُرْ ۙ﴿5﴾ وَلَا تَمْنُنْ تَسْتَكْثِرُ ۙ﴿6﴾
وَلِرَبِّكَ فَاصْبِرْ ؕ﴿7﴾

## 74. అల్ ముద్దస్సిర్

**ఆయత్‌లు : 56** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) దుప్పటి చుట్టుకున్నవాడా! (2) లే, (ప్రజలను) హెచ్చరించు. (3) నీ ప్రభువు ఘనతను వెల్లడించు. (4) నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో.

(5) అపవిత్రతకు (మలినానికి) దూరంగా ఉండు. (6) ఇంకా ఎక్కువ పొందాలని ఉపకారం చెయ్యకు. (7) మరియు నీ ప్రభువు కోసం ఓర్పు వహించు.

1 – 7 వాక్యాలు

అన్నింటికన్నా ముందు వచ్చిన వహీ “ఇఖ్రా బిస్మి రబ్బికల్లజీ ఖలఖ్.” ఆ తర్వాత దైవసందేశం రావడంలో కొంత విరామం ఏర్పడింది. దైవప్రవక్త (స) తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఒకరోజు అకస్మాత్తుగా హిరా కొండ గుహలో మొదటిసారిగా వహీ తెచ్చిన దూతను భూమి ఆకాశాల మధ్య ఒక కుర్చీలో కూర్చుని ఉండగా చూశారు.

అది చూసి ఆయనలో భయం ఆవరించింది. ఇంటికి వెళ్ళి, “నాపై ఏదైనా దుప్పటి కప్పండి” అని ఇంటివారితో అన్నారు. అందువలన ఆయనపై దుప్పటి కప్పబడింది. అదే స్థితిలో ఈ వహీ అవతరించింది. (బుఖారీ, ముస్లిం) ఈ ఆయత్‌లలో అల్లాహ్ తన ప్రవక్తను ఆదేశించాడు. ఓ ముహమ్మద్ (స)! ప్రజలను హెచ్చరించండి. బాగా హెచ్చరించండి. ప్రజలు దైవానికి భయపడనంత వరకు, షిర్క్‌ను విడిచిపెట్టనంత వరకు, కోరికలను విడిచిపెట్టనంత వరకు వారికి సావధానపర్చండి.

మనం దైవానికి భయపడటం లేదు. అందువలననే ఉదయం నమాజ్ చేయడం లేదు. మనం అల్లాహ్‌కు భయపడటం లేదు. అందుకే అవిధేయతకు పాల్పడుతున్నాం. సఫలవంతమయిన జీవితం కోసం దైవభీతి, భయం అవసరం. మన హృదయాల నుండి దైవభీతి, భయం తొలగిపోతే, మనం దారి తప్పాం అని గ్రహించండి. ఇక మన వద్ద విశ్వాసం, ఇస్లాం ల భాగ్యం లేకుండా పోయింది.

فَإِذَا نُقِرَ فِي النَّاقُورِ ﴿8﴾

فَذَٰلِكَ يَوْمَئِذٍ يَوْمٌ عَسِيرٌ ﴿9﴾

عَلَى الْكَافِرِينَ غَيْرُ يَسِيرٍ ﴿10﴾

ذَرْنِي وَمَنْ خَلَقْتُ وَحِيدًا ﴿11﴾

وَجَعَلْتُ لَهُ مَالًا مَمْدُودًا ﴿12﴾

وَبَنِينَ شُهُودًا ﴿13﴾ وَمَهَّدْتُ لَهُ تَمْهِيدًا ﴿14﴾

ثُمَّ يَطْمَعُ أَنْ أَزِيدَ ﴿15﴾

كَلَّا ۖ إِنَّهُ كَانَ لِآيَاتِنَا عَنِيدًا ﴿16﴾

سَأُرْهِقُهُ صَعُودًا ﴿17﴾

إِنَّهُ فَكَّرَ وَقَدَّرَ ﴿18﴾

فَقُتِلَ كَيْفَ قَدَّرَ ﴿19﴾

ثُمَّ قُتِلَ كَيْفَ قَدَّرَ ﴿20﴾

ثُمَّ نَظَرَ ﴿21﴾ ثُمَّ عَبَسَ وَبَسَرَ ﴿22﴾

ثُمَّ أَدْبَرَ وَاسْتَكْبَرَ ﴿23﴾

فَقَالَ إِنْ هَٰذَا إِلَّا سِحْرٌ يُؤْثَرُ ﴿24﴾

إِنْ هَٰذَا إِلَّا قَوْلُ الْبَشَرِ ﴿25﴾

سَأُصْلِيهِ سَقَرَ ﴿26﴾ وَمَا أَدْرَاكَ مَا سَقَرُ ﴿27﴾

لَا تُبْقِي وَلَا تَذَرُ ﴿28﴾

(8) శంఖం ఊదబడినప్పుడు (9) అది బహు కఠిన దినం అవుతుంది. (10) తిరస్కారులకు అది తేలికగా ఉండదు. (11) ఓ ముహమ్మద్! (స) నన్నూ, ఒంటరిగా పుట్టించబడిన ఆ వ్యక్తినీ విడిచిపెట్టు. (12) నేను అతనికి ఎంతో ధనాన్ని ఇచ్చాను. (13) అన్నివేళలా అతని దగ్గర హాజరుగా ఉండే కుమారుల్ని ఇచ్చాను. (14) అతడి కోసం అన్ని రకాల సౌఖ్య సామగ్రిని ఇచ్చాను. (15) నేను అతనికి మరింత ఇవ్వాలని అతడు కోరుతున్నాడు. (16) అలా ఎంతమాత్రం జరుగదు. వాడు మా వాక్యాలకు శత్రువు. (17) వాడిని ఒక కఠినమయిన మెరక పైకి ఎక్కిస్తాను. (18) వాడు ఆలోచించాడు. వాడొక మాటను కల్పించాలని ప్రయత్నించాడు. (19) వాడిపై దైవశిక్ష పడుగాక! వాడు ఎంతటి తప్పుడు మాటను కల్పించజూశాడు. (20) మరల వాడిపై దేవుడి దెబ్బపడుగాక! వాడు ఎలా అంచనా వేశాడు. (21) తిరిగి (ప్రజల వంక) చూశాడు. (22) మరి నుదురు చిట్లించాడు. మొహం మాడ్చుకున్నాడు. (23) తర్వాత వెనక్కి తిరిగాడు. గర్వించ నారంభించాడు. (24) చివరికి ఇలా అన్నాడు, ఇదంతా మొదటి నుండి వస్తున్న మంత్రజాలం తప్ప మరేమీ కాదు. (25) తిరిగి అన్నాడు, ఇది దైవవాణి కాదు. మానవుడి వాణి. (26) నేను అతి త్వరలో వాణ్ణి నరకంలో పడదోస్తాను. (27) సఖర్ అంటే ఏమిటో నీకు తెలుసా? (28) అదొక ప్రమాదకరమైన అగ్ని. అది మిగిల్చి ఉంచదు. విడిచీ పెట్టదు.

8 – 10 వాక్యాలు

పరలోకం గురించి భయభక్తులు లేని కారణంగా దానిని ఆషామాషీ వస్తువుగా భావిస్తున్నాం. దానికి ఇవ్వవలసిన ప్రాముఖ్యతను ఇవ్వడం లేదు. ప్రపంచం కన్నా పరలోకం లక్ష రెట్లు ముఖ్యమైనది. శ్రేష్ఠమయినది. అయినా మనం ప్రాపంచికతకే ప్రాధాన్యతనిస్తున్నాం. ప్రాపంచికత కన్నా పరలోకానికి కాస్తంత అయినా ప్రాముఖ్యత నివ్వడం లేదు. ఇది చాలా తప్పు.

لَوَّاحَةٌ لِّلْبَشَرِ ﴿29﴾ عَلَيْهَا تِسْعَةَ عَشَرَ ﴿30﴾
وَمَا جَعَلْنَآ اَصْحٰبَ النَّارِ اِلَّا مَلٰٓئِكَةً ۙ وَّمَا
جَعَلْنَا عِدَّتَهُمْ اِلَّا فِتْنَةً لِّلَّذِيْنَ كَفَرُوْا ۙ
لِيَسْتَيْقِنَ الَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ وَيَزْدَادَ
الَّذِيْنَ اٰمَنُوْٓا اِيْمَانًا وَّلَا يَرْتَابَ الَّذِيْنَ اُوْتُوا
الْكِتٰبَ وَالْمُؤْمِنُوْنَ ۙ وَلِيَقُوْلَ الَّذِيْنَ فِيْ
قُلُوْبِهِمْ مَّرَضٌ وَّالْكٰفِرُوْنَ مَاذَآ اَرَادَ اللّٰهُ
بِهٰذَا مَثَلًا ۗ كَذٰلِكَ يُضِلُّ اللّٰهُ مَنْ يَّشَآءُ
وَيَهْدِيْ مَنْ يَّشَآءُ ۗ وَمَا يَعْلَمُ جُنُوْدَ رَبِّكَ اِلَّا
هُوَ ۗ وَمَا هِيَ اِلَّا ذِكْرٰى لِلْبَشَرِ ﴿31﴾ ع 1 31 15
كَلَّا وَالْقَمَرِ ۙ ﴿32﴾ وَالَّيْلِ اِذْ اَدْبَرَ ۙ ﴿33﴾

(29) అది శరీరాన్ని నల్లగా కమిలిపోయేలా చేస్తుంది. (30) నరకానికి 19 మంది కాపలావాళ్ళు నియమించబడి ఉన్నారు. (31) మేము నరకానికి కాపలా వుండే దూతలను తయారు చేశాము. వారి సంఖ్య, తిరస్కారులకు ఒక పరీక్ష (ఫిత్నా)గా చేశాము. గ్రంథం కలవారికి నమ్మకం కలగాలని, విశ్వాసులు అనుమానంలో పడకూడదని, మానసిక రోగులు, సత్యతిరస్కారులు, ఇది భలే విచిత్రమయిన విషయం. దాని వెనుక మతలబు ఏమయి ఉంటుంది? అని అనాలని. ఈ విధంగా అల్లాహ్ తాను కోరిన వారిని దారి తప్పిస్తాడు. తాను కోరిన వారికి సన్మార్గాన్ని ఇస్తాడు. నీ ప్రభువు సైన్యాలను ఆయన తప్ప ఇతరులు ఎవ్వరూ ఎరుగరు. ఈ నరకం గురించిన ప్రస్తావన ప్రజలకు ఒక గుణపాఠం. (32) ఎంతమాత్రం కాదు. చంద్రుని సాక్షిగా! (33) రాత్రి సాక్షిగా! అది మరలినప్పుడు

11 - 29 వాక్యాలు

11వ వాక్యం : ఇది దైవప్రవక్తను సంబోధించి చెప్పబడింది. దీని భావం ఏమంటే తిరస్కారుల ఆ సదస్సులో వలీద్ బిన్ ముగీరా మిమ్మల్ని అపఖ్యాతిపాలు చెయ్యాలని, అరేబియా ప్రాంతం అంతటి నుండి వచ్చే హాజీలకు మిమ్మల్ని మంత్రగాడుగా ప్రచారం చెయ్యాలని సలహా ఇచ్చాడు. వాడి సంగతి మీరు నాకు వదిలెయ్యండి. వాడి వ్యవహారం తేల్చడం నా పని. మీరు వాడి గురించి ఆలోచించవలసిన పని లేదు.

13వ వాక్యం : వలీద్ బిన్ ముగీరాకు 12 గురు కొడుకులు. ఆ కొడుకుల కోసం షహూద్ అనే పదం వాడబడింది. అంటే దాని అర్థం, వారికి ఉపాధి కోసం శ్రమ పడడం, దూర ప్రయాణాలు చేయవలసిన పని లేదు. ఎందుకంటే వీరు బాగా ధనవంతులు. అన్ని వేళలా ఈ పిల్లలు తమ తండ్రి వెంట ఉండి అతడికి సాయపడటానికి సిద్ధంగా ఉండేవారు. మరో విషయం అతడి కొడుకులందరూ పేరు పొందినవారు, పలుకుబడి కలవారు. సభల్లో, సమావేశాల్లో అతడి వెంట ఉండేవారు. మూడో విషయం వ్యవహారాలలో వీళ్ళ సాక్ష్యం అంగీకరించబడుతుంది. అంటే అంతటి స్థాయి గలవారన్నమాట.

26వ వాక్యం : అతి సమీప కాలంలో మీకు బాధాకరమయిన కష్టానికి గురిచేస్తాను అని అల్లాహ్ వలీద్ బిన్ ముగీరాకు వార్నింగ్ ఇచ్చాడు. ఇంకా పరలోకంలో మఊద్ అనే ఒక అగ్ని పర్వతం ఉంది. దానిపైకి ఎక్కిస్తాను. అగ్ని మీద కాలు పడితే ఎంతో బాధ కలుగుతుంది. అగ్ని పర్వతం ఎక్కడం, మళ్ళీ దిగడం తిరిగి ఎక్కడం అతి పెద్ద శిక్ష. భరింపశక్యం కాని యాతన. సత్యాన్ని తెలిసి ఉండీ, సత్యాన్ని తిరస్కరించేవాడికి, ప్రజలకు తప్పుడు సలహాలు ఇచ్చేవాడికి, ఖుర్ఆన్‌ను మానవ వాణి అనే వాడికి ఈ శిక్ష పడుతుంది.

وَالصُّبْحِ إِذَآ أَسْفَرَ ﴿34﴾
إِنَّهَا لَإِحْدَى الْكُبَرِ ﴿35﴾ نَذِيرًا لِّلْبَشَرِ ﴿36﴾
لِمَن شَآءَ مِنكُمْ أَن يَتَقَدَّمَ أَوْ يَتَأَخَّرَ ﴿37﴾
كُلُّ نَفْسٍ بِمَا كَسَبَتْ رَهِينَةٌ ﴿38﴾
إِلَّآ أَصْحَٰبَ الْيَمِينِ ﴿39﴾
فِى جَنَّٰتٍ يَتَسَآءَلُونَ ﴿40﴾
عَنِ الْمُجْرِمِينَ ﴿41﴾
مَا سَلَكَكُمْ فِى سَقَرَ ﴿42﴾
قَالُوا لَمْ نَكُ مِنَ الْمُصَلِّينَ ﴿43﴾
وَلَمْ نَكُ نُطْعِمُ الْمِسْكِينَ ﴿44﴾
وَكُنَّا نَخُوضُ مَعَ الْخَآئِضِينَ ﴿45﴾
وَكُنَّا نُكَذِّبُ بِيَوْمِ الدِّينِ ﴿46﴾
حَتَّىٰٓ أَتَىٰنَا الْيَقِينُ ﴿47﴾
فَمَا تَنفَعُهُمْ شَفَٰعَةُ الشَّٰفِعِينَ ﴿48﴾
فَمَا لَهُمْ عَنِ التَّذْكِرَةِ مُعْرِضِينَ ﴿49﴾
كَأَنَّهُمْ حُمُرٌ مُّسْتَنفِرَةٌ ﴿50﴾
فَرَّتْ مِن قَسْوَرَةٍ ﴿51﴾

(34) ఉదయం సాక్షిగా! అది ప్రకాశవంతమయి
నప్పుడు. (35) ఈ నరకం కూడా పెద్ద వస్తువులలో
ఒకటి (అంటే బహు గొప్ప యాతన, పెద్ద కష్టం).
(36) మానవుల కోసం భయపడవలసిన విషయం.
(37) మీలో ముందుకు పోగోరే లేదా వెనుక
ఉండిపోయే, ప్రతి వ్యక్తినీ భయపెట్టేది. (38) ప్రతి
మనిషీ తాను చేసుకున్నదాని కారణంగా తాకట్టులో
ఉన్నాడు. (39) కుడి ప్రక్క వారయిన సదాచారులు
తప్ప. (40) వారు స్వర్గంలోని తోటలలో వుంటారు.
(41) కాని, నేరస్తులను అడగటం జరుగుతుంది.
(42) మీరు నరకంలో ఎందుకు పడ్డారు?

(43) వారు జవాబిస్తారు, “మేము నమాజ్
చేసేవారము కాము. (44) నిరుపేదలకు అన్నం
పెట్టేవారము కాము. (45) అధర్మపరులతో చేరి
ధర్మాన్ని తిరస్కరించే వాళ్ళం (46) ఇంకా,
ప్రతిఫలదినాన్ని తిరస్కరించేవాళ్ళం. (47) చివరకు
మరణం వచ్చేసింది. (48) అప్పుడు సిఫారసు
చేసేవారి సిఫారసు వారికి ఎందుకూ పనికిరానిదై
పోతుంది. (49) వీరికేమయిపోయింది. ఈ హితబోధ
(ఖుర్ఆన్) పట్ల వీరు విముఖత చూపుతున్నారేమిటి?
(50) అడవి గాడిదల లాగా

(51) అవి పులిని చూసి భయపడి పారిపోతుంటాయి.

30, 31 వాక్యాలు

ప్రజల హృదయాల్లో దైవభీతి లోపించినపుడు ప్రజలు ప్రతి విషయాన్నీ గేలిచేస్తారు. చివరకు నరకం విషయాన్ని కూడా హేళనతో తోసిపుచ్చుతారు. “నరకంలో ఉన్నది కేవలం 19 మంది దూతలేగా” అని అంటారు. అబూజహల్ అన్నాడు, ఖురైషులారా! పదిమంది కలసి ఒక దూతను చంపండి. ఆ సభలోని ఒక పహిల్వాను అన్నాడు, 17 మంది దూతలను నేనొక్కడ్నే చంపుతాను. ఇక మిగిలిన జాతి అంతా కలిసి ఇద్దరు దూతలను చంపండి. ఈ విధంగా నరకబాధ నుండి తప్పించుకోగలరు. (తఫ్సీర్, ఖుర్ఆనె కరీం) బాదుషాల కారాగారాలను, నేరస్తుల శిక్షలను మనం చూసినప్పుడు లేదా విన్నప్పుడు కళ్ళ వెంట కన్నీరు ప్రవహిస్తుంది. మరి దేవుని కారాగారం అయిన నరకంలో ఎటువంటి ప్రమాదకరమయిన భయంకరమయిన శిక్ష ఉంటుందో, మీరు అంచనా వేయగలరు.

بَلْ يُرِيْدُ كُلُّ امْرِئٍ مِّنْهُمْ اَنْ يُّؤْتٰى صُحُفًا مُّنَشَّرَةً ﴿52﴾
كَلَّا ؕ بَلْ لَّا يَخَافُوْنَ الْاٰخِرَةَ ﴿53﴾
كَلَّاۤ اِنَّهٗ تَذْكِرَةٌ ﴿54﴾
فَمَنْ شَآءَ ذَكَرَهٗ ﴿55﴾
وَمَا يَذْكُرُوْنَ اِلَّاۤ اَنْ يَّشَآءَ اللّٰهُ ؕ هُوَ اَهْلُ التَّقْوٰى وَاَهْلُ الْمَغْفِرَةِ ﴿56﴾ ع 2 25 16

(52) అసలు విషయం ఏమంటే వీరిలో ప్రతి ఒక్కడూ తన వద్ద తెరవబడివున్న గ్రంథం రావాలని కోరుకుంటాడు. (53) అలా ఎంతమాత్రం జరగదు. అసలు విషయమేమంటే వీరికి పరలోక భయం అనేదే లేదు. (54) ఏమాత్రం సందేహం లేదు. (ఈ ఖుర్ఆన్) ఒక హితబోధ. (55) ఇప్పుడు, కోరుకున్న వారు దీని నుండి గుణపాఠం గ్రహించవచ్చు. (56) అల్లాహ్ కోరితే తప్ప వీరు ఎటువంటి గుణపాఠాన్ని గ్రహించరు. మనం ఆయనకే భయపడవలసిన హక్కు ఉంది. మరియు తనకు భయపడే వారిని క్షమించటానికి కూడా ఆయనే తగినవాడు.

32 – 48 వాక్యాలు : ఈ ఆయత్‌లలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు : నరకం అంటే మామూలు వస్తువు కాదని గ్రహించండి. అది చాలా భయంకరమయిన ప్రదేశం. అక్కడ ఎటుచూసినా అగ్నియే ఉంటుంది. నరకంలోని అగ్గి రవ్వ భూమి మీద పడితే ప్రపంచం మొత్తం తగలబడుతుంది. నరకంలోని ఒక్క నిప్పు రవ్వ పూర్తి ప్రపంచాన్ని తగులబెట్టగలిగినప్పుడు, మనుషులు నరకంలో వేయబడితే అప్పుడు వారి పరిస్థితి ఏమిటి? అల్లాహ్ చెప్పే మరో విషయం, ప్రతి మనిషీ తన కర్మలతో పాటు కట్టివేయబడి ఉంటాడు. మనిషి దగ్గర సత్కర్మలు ఉంటే స్వర్గానికి పోతాడు. దుష్కర్మలు వెంట ఉన్నవాడు నరకానికి అప్పగించబడతాడు.

పరీక్షలలో మార్కులను బట్టి పాస్ / ఫెయిల్ కావటం జరుగుతుంది. మంచి మార్కులు రాకపోతే విద్యార్థి ఫెయిల్ అవుతాడు. మంచి మార్కులు వస్తే పాస్ అవుతాడు. అంటే పాస్ / ఫెయిల్ మార్కుల్ని బట్టి నిర్ణయమయినట్లే, పరలోకంలో స్వర్గం, నరకం నిర్ణయం కర్మలను బట్టి జరుగుతుంది. కర్మలు మంచివి అయితే స్వర్గం లభిస్తుంది. కర్మలు చెడ్డవి అయితే నరకం లభిస్తుంది. మోక్షం అనేది ఎవరి సిఫారసులోనూ, ఏదైనా వంశంతో సంబంధం కారణంగా, లేక ఫలానా వారితో స్నేహం కారణంగా లేదా ఏదయినా వసీలా కారణంగా లభించదు. కాబట్టి స్వర్గానికి వెళ్ళగోరితే మంచి పనులు చెయ్యండి. అంటే దైవారాధన, పేదలకు సహాయం, తల్లిదండ్రుల సేవ చేయండి. లేదా నరకంలో మాడటానికి తయారవ్వండి.

49 – 56 వాక్యాలు : ఈ ఆయత్‌లలో తిరస్కారుల రోగానికి మూల కారణం చూపబడింది. అది పరలోకం పట్ల ఏమరుపాటు, తిరస్కారులు పరలోకం పట్ల భయం లేనివారు, పరలోకం పట్ల ఏమరుపాటు వహిస్తున్నారు. వారు ప్రపంచాన్నే సర్వస్వంగా భావిస్తున్నారు. అందుచేత వీరు పులిని చూసి అడవి గాడిదలు పరుగెత్తినట్లుగా ఖుర్ఆన్ నుండి పారిపోతున్నారు. విశ్వసించడానికి రకరకాల వంకలు సాకులు వెదుకుతున్నారు. చివరలో స్పష్టంగా చెప్పబడింది. దైవం ఎవరి విశ్వాసానికి అగత్యపరుడు కాడు. ఖుర్ఆన్ ఒక హితబోధ. ఎవరు కోరితే వారు దానిని గ్రహించవచ్చు. ప్రయోజనం పొందవచ్చు. కోరిన వారు దీనిని తిరస్కరించవచ్చు. నష్టపడవచ్చు. హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖించారు – దైవప్రవక్త (స) (హువ అహ్లుత్తఖ్వా వ అహ్లుల్ మగ్ఫిరత) పఠించి ఇలా అన్నారు : "ప్రజలారా! మీ ప్రభువు అంటున్నాడు, మీరు భయపడవలసింది నాకే. నాతోపాటు వేరెవర్నీ ఆరాధ్యుడుగా చేసుకోకండి. కనుక నాకు భయపడేవాడిని నాతో పాటు ఎవరినీ ఆరాధ్యునిగా చేసుకోని వాడిని నేను క్షమిస్తాను." (ఇమామ్ అహ్మద్, తిర్మిజీ, నసాయి, దారమి, ఇబ్నుమాజ) (అల్లాహ్‌యే సద్బుద్ధినివ్వుగాక!)